క్లుప్తంగా

విస్తృతంగా వాహనాల తనిఖీలు


గొల్లప్రోలు శివారు చెందుర్తి సెంటర్ వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

పిఠాపురం: ఎన్నికల నియమావళి అమలులో భాగంగా అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ సరిహద్దుల్లోని అన్ని రహదారుల్లో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఆదివారం గొల్లప్రోలు శివారు చెందుర్తి సెంటర్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఎస్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారులు పలు వాహనాలను తనిఖీలు చేశారు. ఎన్నికలకు సంబంధించి వాహనాల్లో ఏ విధమైన సామగ్రి లేని వాహనాలను విడిచిపెట్టారు.

నూకాలమ్మ పూలగరగ ఉత్సవం


ఆలయం వద్ద పూల గరగలతో నృత్యం చేస్తున్న భక్తులు

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ ఆలయ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం పూల గరగ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ, చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఆలయ కమిటీ పర్యవేక్షణలో గరగలను ఊరేగించారు. గరగలపై భక్తులు కొత్త చీరలను పాన్పుగా వేసి అనంతరం వాటిని ధరిస్తే శుభకరమని భావిస్తుంటారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ జోకా నానాజీ, ఎంపీటీసీ జాగు వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో లయన్స్ అగ్రస్థానం


సమావేశంలో మాట్లాడుతున్న బాదం బాలకృష్ణ

సామర్లకోట: పేదలకు సేవలు అందించడంలో లయన్స్ క్లబ్ అగ్రస్థానంలో ఉన్నదని క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక అయోధ్యరామపురం శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం క్లబ్ రీజనల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సామర్లకోట క్లబ్ జిల్లాలో ఉత్తమంగా దూసుకుపోతోందని అన్నారు. ఇక్కడి క్లబ్ సభ్యుడు ఈదల ఈశ్వరకుమార్ వచ్చే ఏడాది జిల్లా గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు తెలిపారు. క్లబ్ మొదటి వైస్ గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్ మాట్లాడుతూ తాను గవర్నరుగా బాధ్యతలు స్వీకరించే సమయంలో సేవా కార్యక్రమాలు మరింత పెంచడంతో పాటు సభ్యుల సంఖ్య పెంచడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమానికి రీజనల్ చైర్ పర్సన్ చిత్తూలూరి శ్రీదేవి అధ్యక్షత వహించి ఏటా రీజనల్ సమావేశం నిర్వహించాలన్నారు. ముఖ్య అతిథులను చిత్తూలూరి శ్రీదేవి, లయన్స్ క్లబ్ కో ఆర్డినేటర్ చిత్తూలూరి వీర్రాజు సత్కరించారు. జిల్లాలోని ఉత్తమ క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ లయన్స్ క్లబ్ గవర్నర్లు లింగమల్లు కృష్ణమూర్తి, కొడూరి రంగారావు, 2వ వైస్ గవర్నర్ వి.కోటేశ్వరరావు, క్లబ్ అధ్యక్షుడు కానుబోయిన విజయకృష్ణ, కార్యదర్శి వై.రామలింగ ప్రసాద్, కో ఆర్డినేటర్ సీహెచ్ శ్రీరామ గణేష్‌ప్రసాద్, మహిళా ప్రతినిధులు సీహెచ్ సాయిప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న బాదం బాలకృష్ణ

బోట్‌క్లబ్: రక్తదానం ప్రాణదానంతో సమానమని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక టౌన్ హాల్లో ఆదివారం ఎల్‌బీఎన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. యువత సేవా కార్యక్రమాల ద్వారా ముందుకు రావడం అభినందనీయమన్నారు. తొలి రక్తదాన శిబిరంలో 60 యూనిట్ల రక్తాన్ని బ్లడ్ బ్యాంక్‌కు అందించడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు అంకుర్ సురానా భవిష్యత్తులో తమ సంస్థ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. అనంతరం ముఖ్య అతిథి బాదం బాలకృష్ణ రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రెటరీ డాక్టర్ సిరాజ్, ట్రెజరర్ సతీష్, ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ కామరాజు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నిండుగా గోదారి.. నిండుకున్న ఫిల్టర్ బెడ్..

- నీటి మట్టం 1.5 మీటర్లకు తగ్గి పసరుదేరిన నీరు
- తాగునీటిని నింపే సమయమిదే


నీటిమట్టం తగ్గిపోయి ఆకుపచ్చ రంగులోకి మారిన ఫిల్టర్ చెరువు

సామర్లకోట: గుర్రపు డెక్క తొలగింపుతో గోదావరిలో నీటి మట్టం పెరిగింది. ఇదే అవకాశంగా అధికారులు ఫిల్టర్ బెడ్‌లు నింపుకోవాలి. ఐదు తూముల వద్ద నుంచి పీబీసీ కెనాల్ మీదుగా ఫిల్టర్ చెరువులోనికి నీరు వస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని లాకుల సమీపంలో ఉన్న చానల్ గేట్లను ఎత్తడం ద్వారా నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉంది. దీనికి తోడు లాకుల గేట్లను మూసి వేయడం ద్వారా గోదావరి కాలువలో నీటి మట్టం మరింత పెరిగే అవకాశం ఉంది. దాంతో మరింత వేగంగా ఫిల్టరు చెరువులోకి నీరు వచ్చే అవకాశాలు ఉన్నాయి. సామర్లకోట గోదావరి కాలువ నుంచి ఉండూరు రైల్వే గేటు వద్ద ఉన్న నాగార్జున ఫిల్టరు చెరువులోనికి నీటిని నింపి దానిని ఫిల్టరు చేసి పట్టణ ప్రజలకు తాగునీరుగా అందిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నీటిని శుద్ధి చేయడానికి అదనంగా క్లోరిన్ సిలిండర్లను సిద్ధం చేశారు. గోదావరి కాలువలో నీటిని నేరుగా ఫిల్టర్ ప్లాంటులోకి పంపడం వల్ల అక్కడి నీరు ఆకుపచ్చ రంగులోకి మారిపోయింది. సామర్లకోట ఫిల్టర్ బెడ్ చెరువులో ప్రస్తుతం 1.5 మీటర్ల నీటి మట్టం ఉంది. చెరువులో నీటి మట్టం మూడు మీటర్ల వరకు ఉంటే వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా ఉంటుంది. ఏప్రిల్ 15వ తేదీ నాటికి గోదావరి కాలువను మూసేస్తామని అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం సాగునీటి అవసరం లేదు కనక గోదావరి జలాలతో ఫిల్టర్ చెరువులో నింపితే ఆకుపచ్చ రంగు మారే అవకాశం ఉంది.

ఫిల్టర్ చెరువు నింపాలి



గోదావరి కాలువలో నీరు ఉన్న సమయంలోనే ఫిల్టర్ చెరువులో నీరు నింపాలి. చెరువులో నీరు మూడు నెలలుగా వాడకపోవడంతో పసరుతేరింది. నీటి మట్టం పెరిగితే ఆ సమస్య తీరుతుంది. పట్టణ ప్రజల తాగునీటి అవసరాలు గుర్తించి చేపల వేట లేకుండా చూడాలి.
– కాళ్ల లక్ష్మీనారాయణ, మాజీకౌన్సిలర్, సామర్లకోట

నీటి ఎద్దడి లేకుండా చర్యలు



ఫిల్టర్ చెరువులో నీటి మట్టం పెంచేందుకు, నీటి ఎద్దడి లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటాం. గోదావరి నీరు ఫిల్టర్ చెరువులోనికి జోరుగా వచ్చేలా ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడుతా. నీటి సమస్యను కలెక్టరు దృష్టికి తీసుకువెళతాం.
– జి.రామారావు, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట


నీటిని శుద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్న క్లోరిన్ సిలిండర్లు

ఎండీయూ వాహనాల తనిఖీ


చంద్రమాంపల్లిలో ఎండీయూ రంగులు మార్చాలని సూచిస్తున్న ఆర్డీఓ

పెద్దాపురం: రేషన్ సరకులు పంపిణీ చేసే వాహనాలకు ఉన్న వైఎస్సార్ సీపీ రంగులను తొలగించాలని ఈఆర్వో, ఆర్డీఓ జేఎస్ రామారావు ఆదేశించారు. మండలంలోని చంద్రమాంపల్లి, దివిలి, జి.రాగంపేట, పులిమేరు, కాండ్రకోట, కట్టమూరు గ్రామాల్లో ఆదివారం ఎండీయూ వాహనాల ప్రజా పంపిణీ ప్రక్రియను తనిఖీ చేశారు. వాహనాలపై ఉన్న ప్రభుత్వ స్టిక్కర్లను తొలగించి సరుకులు పంపిణీ చేపట్టాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డీటీ పద్మజ, ఎంఎస్ఓ విజయకుమారి, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా చండీహోమం

పెద్దాపురం: మరిడమ్మ తల్లి ఆలయంలో ఆదివారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనారావు ఆధ్వర్యంలో వేద పండితులు ఐవీ ప్రసాద్ శర్మ, ఎన్‌వీ శాస్త్రి, ఏవీ భానుమూర్తి హోమాన్ని నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రసాయనాలు ఫుల్.. ఆరోగ్యం కిల్

- గ్రామాల్లోని చెరువుల్లో రసాయనాల వినియోగం
- నాచుజాతి మొక్కలను చంపేందుకు వాడకం
- కలుషితమవుతున్న జలాలు
- పట్టించుకోని అధికారులు

పిఠాపురం: గ్రామాల్లోని చెరువుల్లోని కొంతమంది చేపల పెంపకం దారులు నాచుజాతి మొక్కలను చంపేందుకు రసాయనాలను వినియోగిస్తున్నారు. దీంతో చెరువులు పూర్తిగా కలుషితమవుతున్నాయి. రసాయనాలు వినియోగించిన చెరువుల్లో నీటిని పశువులు సైతం తాగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేసున్నారు. ఈ చెరువుల్లో చేపలను తిన్న ప్రజలు సైతం అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. చెరువుల్లో నాచు మొక్కలు తొలగించవలసి ఉండగా వ్యాపారులు మాత్రం రసాయనాలతో ఆ మొక్కలను చంపుతున్నారు.

మండలంలో ఇలా...

కొత్తపల్లి మండలంలోని ఎండపల్లి, రమణక్కపేట, కొమరగిరి, ఇసుకపల్లి, కుతుకుడుమిల్లి శివారు పెద్దకలవలదొడ్డి, వాకతిప్ప గ్రామాల్లోని చెరువుల్లో నాచుమొక్కలు చంపేందుకు రసాయనాలు వినియోగించారు. దీంతో చెరువుల్లోని నాచు మొక్కలు చనిపోవడంతో పాటు చెరువులో పెరిగే చేపలపై కూడా ఇది విష ప్రభావం చూపుతోందని స్థానికులు చెబుతున్నారు.


వాకతిప్ప చెరువులో రసాయనాల వినియోగంతో రంగుమారిన నీరు, చనిపోయిన నాచుమొక్కలు

నిబంధనలకు నీళ్లు

నిబంధనల ప్రకారం పశువులు నీరు తాగే చెరువులు, చేపల చెరువుల్లో ఎటువంటి రసాయనాలు ఉపయోగించరాదు. ఈ రసాయనాలు ఉపయోగించడం వలన ప్రజలు ఆరోగ్యంపై తీవ్రంగా ప్రభావం చూపుతుంది. అయినప్పటికీ చెరువుల లీజుదారులు ఎటువంటి అనుమతులు లేకుండా విష ప్రభావం ఉన్న రసాయనాలు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. దీంతో ఆయా చెరువుల్లో నీటిని పశువులు తాగడం లేదు. నీటి వాసన చూసి తాగకుండా వెళ్లిపోతున్నాయని పాడి రైతులు చెబుతున్నారు. ఈ నీటిని తాగడం వలన పశువులు కూడా అనారోగ్యం బారిన పడతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులకు పట్టని వైనం

చెరువుల్లో విషపూరిత రసాయనాలు, మృత జీవుల వ్యర్థాలను విచ్చలవిడిగా వినియోగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చెరువుల లీజు వ్యాపారుల నుంచి అధికారులకు మామూళ్లు అందుతున్నాయని, దీంతో వారు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రసాయనాలు వినియోగించరాదు

చేపల పెంపకం దారులు లీజుకు తీసుకున్న పంచాయతీ చెరువుల్లో ఎటువంటి రసాయన మందులు వినియోగించరాదు. దీనివలన నీరు కలుషితమవుతుంది. ఈ చెరువుల్లో చేపలు తినడం వలన ప్రజలకు కూడా అనారోగ్య సమస్యలు వస్తాయి. చేపల చెరువుల్లో రసాయనాలు వినియోగించే వారికి నోటీసులు జారీ చేసి, చర్యలు తీసుకుంటాం.
శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, వాకతిప్ప

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


దుర్గాడలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పెండెం దొరబాబును సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఆయన ఆదివారం వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొని సిద్ధి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ నేతలు ఉన్నారు.


వంగా గీతకు స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ సభ్యులు

కాకినాడ ఎంపీ వంగా గీత పూజలు

కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ అభ్యర్థి వంగా గీత దుర్గాడలో వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆమెకు ఘన స్వాగతం పలకారు. ఆమె స్వామివారికి ప్రత్యేక చేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఆమె వెంట పలువురు వైఎస్సార్ సీపీ నేతలు ఉన్నారు.

వైఎస్సార్ సీపీలో రజకుల చేరిక


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో దవులూరి దొరబాబు, చైర్ పర్సన్ తదితరులు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబుకు స్థానిక 26వ వార్డుకు చెందిన 80 కుటుంబాలు మద్దతు ఇచ్చారు. స్థానిక అయోధ్యరామపురంలోని రజకుల స్థలంలో ఏర్పాటు చేసుకున్న సమావేశానికి ఆదివారం దొరబాబును ఆహ్వానించారు. స్థానిక అభ్యర్థి ఎమ్మెల్యే అయితే తమ సమస్యలను పరిష్కారమవుతాయన్న అభిప్రాయంతో దొరబాబుకు మద్దతు ఇస్తున్నట్టు వారు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలని కోరుతూ పార్టీలో చేరుతున్నట్టు వారు తెలిపారు. స్థానిక విఘ్నేశ్వర రజక సంఘ అధ్యక్షుడు వాకలపూడి రాజు, కార్యదర్శి వలస శంకర్రావు, కోశాధికారి యాండ్రపు ప్రసాద్, సభ్యులు గురాన యేసు, గుడివాడ రమణ, గుమ్మడి రమణ తదితరుల ఆధ్వర్యంలో 80 కుటుంబాలు పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా వేసి దొరబాబు స్వాగతించారు. రజకుల సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని వారికి దొరబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం ఖాయమని అందరికీ అర్థం అయిందన్నారు. ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు, తనకు ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేయాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజెస్, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, హుస్సేన్‌పురం ఉప సర్పంచ్ యవర్న చంద్రశేఖర్, పార్టీ పట్టణ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ పాగా సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాబలమే వైఎస్సార్ సీపీకి వెన్నుదన్ను

- సంక్షేమాభివృద్ధితో పార్టీ విజయం తథ్యం
- మీలో ఒక్కడిగా గెలిపించండి
- ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి

పెద్దాపురం: ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ప్రజా బలం వెన్నుదన్నుగా నిలుస్తుందని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. విజయ సంకల్పయాత్ర పేరిట ఆదివారం మండలంలోని తిరుపతిలో ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, శృంగార వల్లభ స్వామి ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, కుంచే అమరావతి, కరెడ్ల వీరాస్వామి ఆధ్వర్యంలో సాగుతున్న యాత్రలో దొరబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తించి ప్రభుత్వానికి ఓటు వేయాలని ప్రజలను కోరారు. మీలో ఒక్కడిగా, స్థానికుడిగా ఆదరించి ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. సీఎం జగన్ సంక్షేమ పథకాలను పార్టీ రహితంగా అర్హులందరికీ అందించారన్నారు. ఈ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్‌కు ఓటు వేసి గెలిపించాలని దొరబాబు కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పులిమేరు సొసైటీ అధ్యక్షులు గోపు మురళి, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మండల కన్వీనర్ గోపు మురళి తదితరులతో పాటు అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


తిరుపతిలో మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న దొరబాబు

వైఎస్సార్ సీపీలో 50 మంది చేరిక

రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు నచ్చి మరోసారి సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని చూసేందుకు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నుంచి భారీగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని తిరుపతి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు ఆధ్వర్యంలో గ్రామంలో టీడీపీకి చెందిన సుమారు 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామ టీడీపీ వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు నగిరెడ్డి నాగబాబు, దడాల ఆనందరావు, జాజుల నాగబాబు తదితరులకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి తమవంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.


పార్టీలో చేరిన నాయకులను ఆహ్వానిస్తున్న దొరబాబు

ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు


పిఠాపురం ఏబీసీ చర్చిలో చిన్నారుల సందడి

- గ్రామాల్లో ర్యాలీలు చేసిన క్రైస్తవులు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు


పెద్దాపురంలోని బైబిల్ మిషన్ సంఘం ఆధర్యంలో ర్యాలీ

పిఠాపురం: నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవులు చెట్టు కొమ్మలకు అందమైన పూలను అలంకరించారు. నూతన వస్త్రాలు ధరించి మట్టలను చేతబూని వీధుల్లో ర్యాలీలు చేశారు. నియోజకవర్గంలోని పిఠాపురం పట్టణం, గొల్లప్రోలు నగర పంచాయతీ, గొల్లప్రోలు, కొత్తపల్లి, పిఠాపురం మండలాల్లో అన్ని గ్రామాల్లోనూ క్రైస్తవులు మట్టలతో సువార్త ర్యాలీలు నిర్వహించారు. పిఠాపురం మండలం జములపల్లిలో బర్నింగ్ టూల్స్ మినిస్ట్రీస్, పిఠాపురంలో ఏబీసీ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ర్యాలీలు చేశారు.

సామర్లకోట: పట్టణ పరిధిలో ఆంధ్రాబాప్టిస్టు చర్చి, సెంటినరీ అగ్రస్థాన లూథరన్ చర్చి, సెంటినరీ బాప్టిస్టు చర్చి, సాలెమ్ బాప్టిస్టు, ఆర్‌సీఎం చర్చిలలో అధిక సంఖ్యలో క్రైస్తవులు మట్టలను చేతపట్టి ర్యాలీలు చేశారు. అదే విధంగా మండల పరిధిలోని ఉండూరు, వేట్లపాలెం, పవర గ్రామాల్లో ర్యాలీలు జరిగాయి. పాస్టర్లు కిరణ్‌బాబు, బి కిరణ్‌కుమార్, డాక్టరు ఈలి సువార్తరాజు, వంకా జాన్, ఎంఎ జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం: క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం దైవజనులు నంగిన సత్యానందం, నంగిన శామ్యూల్ సుదీప్ తదితరుల ఆధ్వర్యంలో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. దివిలి, తిరుపతి, చదలాడ, కాండ్రకోటతో పాటు పిఠాపురం మండలం విరవ క్రీస్తు శాంతి ప్రార్థన మందిరాలతో పాటు పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఆయా చర్చిల్లో విశ్వాసులు మట్టలు చేతబూని ర్యాలీ నిర్వహించారు.


సామర్లకోటలో మట్టలతో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు


పిఠాపురంలో బీబీసీ చర్చిలో క్రైస్తవుల ప్రదర్శన

గ్రామాల్లో క్షయ నివారణ ర్యాలీలు


విరవలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది


క్షయ రోగులకు సూచనలిస్తున్న డాక్టర్ శ్రీహిమవతి

పిఠాపురం: ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పిఠాపురం మండలం విరవలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విరవ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ఇందిర ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో పర్యటించి టీబీ అంతం.. మన పంతం అంటూ నినాదాలు చేశారు. రెండు వారాలకు పైబడి దగ్గు, జ్వరం ఉంటే వెంటనే కళ్లె పరీక్ష చేయించుకోవాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కృష్ణ, రాంబాబు, సత్యానందం, మంగాదేవి, రాజ్‌కుమార్, రమేష్, అప్పారావు, ఆనంద్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన పెంచుకోవాలి

సామర్లకోట: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహిమవతి అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆస్పత్రి ఆవరణలో ఈ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఏ ప్రభుత్వ ఆస్పత్రిలోనైనా కంటి పరీక్షలు చేయించుకోవాలని, ఆ పరీక్షల ద్వారా క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు మందులు వాడితే నివారణ అవుతుందని చెప్పారు. అన్ని ప్రభుత్వాస్పత్రులలో ఈ వ్యాధి నివారణకు మందులు ఉచితంగా ఇస్తారని ఆమె వివరించారు. ఆరోగ్య సిబ్బంది పి.సుబ్బారావు, వై రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే సామర్లకోట పీహెచ్‌సీలో సూపరింటెండెంట్ డాక్టరు పి.అమల క్షయ వ్యాధిపై అవగాహన కల్పించి, రోగులకు ఉచితంగా మందులు అందజేశారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారి సూర్యకుమారి

పెద్దాపురంలో..

పెద్దాపురం: టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ సూర్యకుమారి, ఎస్‌టీఎస్ ఎన్‌వీ రమణ అన్నారు. ప్రపంచ క్షయ నివారణా దినోత్సవంలో భాగంగా ఆదివారం టీబీ యూనిట్ ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం సూర్యకుమారి ర్యాలీని ప్రారంభించారు. సూపర్‌వైజర్లు రామకృష్ణ, ఎల్‌టీ భవాని, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాస్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.